క్లుప్తంగా

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



గగ్గటూరులో రోడ్డు పక్కన ఒరిగిన విద్యుత్ స్తంభం

పాణ్యం: మండల పరిధిలోని గగ్గటూరు గ్రామంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. గ్రామంలో కొన్ని చోట్ల రైతులు ఏర్పాటు చేసుకున్న బోర్లకు విద్యుత్ సరఫరా అందించే స్తంభాలు ఎప్పుడు కూలుతాయనే భయంతో రైతులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీన్నారు. ఇటీవల వీచిన గాలుల ధాటికి విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. అయినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో రైతులు అధికారులపై మండిపడుతున్నారు. అలాగే ఒరిగిన స్తంభాలను సరి చేయాలని సూచించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రమాదం పొంచి ఉందని, అధికారులు చర్యలు తీసుకొని విద్యుత్ స్తంభాలను బాగు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

పంటను కాపాడుకునేందుకు పాట్లు



పోలకల్‌లో వంకాయ మొక్కలకు నీరు పోస్తున్న రైతన్నలు

సి.బెళగల్: నీటి ఎద్దడి నెలకొనడంతో మండలంలో వివిధ పంటలు సాగు చేసిన రైతులు వాటిని కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. తొలకరి వర్షాలకు కొందరు రైతులు పలు రకాల పంటల విత్తనాలు, కూరగాయల మొక్కలను నాటుకున్నారు. అయితే ప్రస్తుతం అవి మొలక దశలో ఉన్నాయి. అయితే వర్షం లేకపోవడంతో వాటిని రక్షించుకునేందుకు బిందెలతో నీటి తడులను అందిస్తున్నారు. పోలకల్ గ్రామంలో రైతు వెంకటేశ్వర్లు ఎకరన్నర పొలంలో వంకాయ నార నాటుకున్నాడు. మొక్కలను బతికించుకునేందుకు ఆదివారం బిందెలలో నీటిని తీసుకొచ్చి మొక్కలకు తడులు ఇస్తూ కనిపించారు.

ప్రసాద్ మృతి తీరని లోటు

కర్నూలు కల్చరల్: ఎస్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు పి.ప్రసాద్ మృతి తీరని లోటని ఆయన ఆశయాలను కొనసాగిద్దామని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోకారి, జనార్దన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో ఆయన సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన పి.ప్రసాద్ మరణించడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, గౌరవాధ్యక్షులు రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు బ్రెడ్డు పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎంసీహెచ్ బ్లాక్‌లోని ప్రసూతి విభాగంలో గర్భిణులు, బాలింతలకు ఆదివారం కమలాపురం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్రెడ్డు పంపిణీ చేశారు. ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సభ్యులు సాయిప్రదీప్ మాట్లాడుతూ.. మానవసేవే మాధవసేవ అన్న గొప్ప సంకల్పంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. సంస్థ ప్రెసిడెంట్ సునీల్, డాక్టర్ జి.నాగేంద్ర, ఉమామహేశ్వరప్ప, గణేష్, కమలాపురం పవన్, గుజరాతి వెంకటేష్ పాల్గొన్నారు.

తైక్వాండోలో రాణించాలి

కర్నూలు (టౌన్): మార్షల్ ఆర్ట్స్, తైక్వాండోలో చిన్నారులు రాణించాలని 17వ వార్డు కార్పొరేటర్ పద్మలతా రెడ్డి సూచించారు. స్థానిక పాత బస్టాండ్ కొండారెడ్డి బురుజు వద్ద చిన్నారులకు ఆదివారం తైక్వాండోలో బెల్ట్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన చిన్నారులకు బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. తైక్వాండో శిక్షకులు అజయ్, తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు ఘన సత్కారం

కర్నూలు (టౌన్): నీట్‌లో ఆలిండియా స్థాయిలో 657వ ర్యాంకు, కేటగిరీ స్థాయిలో 414వ ర్యాంకు సాధించిన భవనాసి ఇషాంత్‌కు ఘన సత్కారం లభించింది. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీకి చెందిన ఈత కొలను వద్ద జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్మింగ్ కోచ్ నటరాజరావు, అసోసియేషన్ కార్యదర్శి రామక్రిష్ణ యాదవ్ మాట్లాడారు. ఇషాంత్ వైద్య విద్యలో ఉన్నతంగా రాణించి పేదలకు వైద్య సేవలు అందించాలన్నారు. ఉపాధ్యక్షుడు సర్వేశ్వర గౌడ్, కోశాధికారి దస్తగిరి, సంయుక్త కార్యదర్శి రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జరభద్రం

- వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలి
- దోమల నివారణతో వ్యాధులకు చెక్
- డెంగ్యూ, మలేరియా నివారణకు వైద్యశాఖ చర్యలు
- వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ముఖ్యం



గడివేములలో పిచ్చిమొక్కలు, చెత్తను తొలగిస్తున్న గ్రామ పంచాయతీ కూలీలు



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

గడివేముల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అయితే ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. పరిసరాల శుభ్రత లోపిస్తే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. ఆడ అనాఫిలెస్ దోమ వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ సాధారణంగా ఇంటి ముందు నిల్వ ఉన్న నీటిలో, నీటి తొట్టెలపై పెరుగుతుంది. సాధారణంగా మలేరియా జ్వరం 10 నుంచి 14 రోజుల వరకు ఉంటుంది. వణుకుతో కూడిన జ్వరం వస్తుంది. జ్వరం వచ్చినప్పుడు చెమటలు పట్టి తలనొప్పి ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి భారిన పడకుండా ఉండాలంటే పరిసరాల్లో చెత్త చెదారం, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

గడివేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 125 నుంచి 140 మంది దాకా రోజూ ఆసుపత్రికి వస్తుంటారు. ప్రతి నెలా 575 మందికి మలేరియా పరీక్షలు, డెంగ్యూ 55, వివిధ రకాల కణాల పరీక్షలు 65, ఆర్‌బీఎస్ 262, హెచ్‌బీ 136 మందికి టెస్టులు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. వర్షాలు పడుతుండటంతో జ్వరాలతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. వ్యాధులపై వైద్య సిబ్బంది ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్న చిన్న జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులు ప్రజలకుండా చూసుకోవచ్చని చెబుతున్నారు. గ్రామాల్లో దోమల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో పాటు మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- డెంగీ జ్వరం టైగర్ దోమ వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ నిల్వ ఉన్న నీటిలో గుడ్లు పెడుతుంది. డెంగీ జ్వరం 10 నుంచి 15 రోజుల వరకు ఉంటుంది. ఒక్కసారిగా జ్వరం వచ్చి తీవ్రమైన తలనొప్పి, నొసటిపై నొప్పి ఉంటుంది. కంటి లోపల కూడా నొప్పి ఎక్కువగా ఉంటుంది.
- చికెన్ గున్యా ఈడిస్ దోమ వల్ల వస్తుంది. చిన్నగా, నల్లగా ఉండే ఈ దోమపై తెల్లని మచ్చలుంటాయి. ఈ జ్వరం కూడా మామూలుగా 10 నుంచి 14 రోజుల వరకు ఉంటుంది. జ్వరం తగ్గిన తర్వాత 10 రోజుల పాటు ఒళ్లు నొప్పులు ఉంటాయి. ఈ వ్యాధి సోకిన వారికి ఒళ్లు నొప్పులతో పాటు అధిక జ్వరం వస్తుంది.
- మెదడు వాపు క్యూలెక్స్ దోమ వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ మురుగు నీటిలో పెరుగుతుంది. క్యూలెక్స్ దోమ ద్వారా వ్యాపించే అర్బో వైరస్ వల్ల కొంగలు, బాతులు, పందుల ద్వారా ఈ వ్యాధి మనుషులకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధి 10 నుంచి 14 రోజుల పాటు ఉంటుంది. ఈ వ్యాధి సోకిన వ్యక్తికి జ్వరంతో పాటు మత్తుగా ఉన్నట్లు ఉంటుంది. వ్యాధిగ్రస్తులు ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వెళ్తారు. వ్యాధి తీవ్రంగా ఉన్నప్పుడు బ్రెయిన్ డెడ్ అయ్యే అవకాశాలు ఉంటాయి. ఈ వ్యాధి 2 నుంచి 14 ఏళ్ల లోపు చిన్నారులకు అధికంగా వ్యాపిస్తుంది.
- మలేరియా ప్లాస్మోడియం జాతి సూక్ష్మక్రిముల మూలంగా ఎనాఫిలిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఈ దోమ కుట్టిన వ్యక్తి రక్తంలోకి ప్రవేశించిన సూక్ష్మక్రిములు కాలేయాన్ని చేరుకుని కణాల్లోకి చొచ్చుకెళతాయి. ఇవి సంతానాన్ని వద్ధి చేసి మలేరియా వ్యాధిని కలిగిస్తాయి. వస్తూ పోయే జ్వరం. కడుపులో అసౌకర్యం, చలితో వణుకు, కొంతసేపటికే చెమటలు మలేరియా లక్షణాలు.
- కామెర్లు కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా వస్తాయి. ఇది హెపటైటిస్-బి, హెపటైటిస్-సీ వంటి ఇన్‌ఫెక్షన్లతో కామెర్లు వచ్చే అవకాశం ఉంది. కళ్లు, చర్మం పసుపు పచ్చగా మారడం, రక్తంలో బిలిరూబిన్ స్థాయి పెరగడం, ఆకలి మందగించడం, జ్వరం, గొంతునొప్పి, మూత్రం పచ్చగా రావడం, కడుపునొప్పి వంటి లక్షణాలుంటాయి.
- డయేరియా బ్యాక్టీరియా, వైరల్, పరాన్న జీవుల ఇన్ఫెక్షన్ వల్ల నీళ్ల విరేచనాలు వస్తాయి. రోజుకు మూడు అంతకన్నా ఎక్కువగా నీళ్ల విరేచనాలు అయితే డయేరియాగా గుర్తించవచ్చు. ఈ వ్యాధితో ఒంట్లో ఉండాల్సిన నీటి శాతం తగ్గిపోయి ముఖ్యమైన లవణాలు (బైకార్బొనేట్, పొటాషియం) బయటకుపోవడం ద్వారా డీహైడ్రేషన్‌కు దారి తీస్తుంది.

నివారణ చర్యలు

విషజ్వరాల కట్టడికి పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది కృషి చేస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తున్నారు. ఆసుపత్రికి వచ్చిన వారికి, గ్రామాల్లో వైద్య సిబ్బంది రక్త నమూనాలను సేకరిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తిచెందే టైఫాయిడ్ పాటు డయేరియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణంతకమని డాక్టర్ తెలిపారు. బ్యాక్టీరియా కారకం ద్వారా కాలుష్యానికి గురయ్యే నీటిని సేవించడం వల్ల ఈ వ్యాధులు సంక్రమిస్తాయన్నారు.

జ్వరం వస్తే వైద్యులను సంప్రదించాలి



వర్షాకాలంలో జ్వరం రాగానే వెంటనే దగ్గరలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందాలి. వైద్యుల సిఫార్సు మేరకు మందులు వాడాలి. అయినా జ్వరం తగ్గకపోతే రక్త పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణకు అవసరమైన మందులు వాడి, జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి. అవసరమైన మందులతో పాటు వివిధ రకాల రక్తపరీక్షలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్నాయి,

– డాక్టర్ కిరణ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యుడు, గడివేముల

త్వరలో గోరుకల్లు రివెట్మెంట్ పనులు



గోరుకల్లు నుంచి వదిలిన నీళ్లు

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు జలాశయం రివెట్మెంట్ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు ఈఈ శుభకుమార్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కట్ట కుంగిపోవడంతో వాటి మరమ్మతుల కోసం రూ.2.50 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. వీటికి సంబంధించి ఇటీవలే టెండర్లు పిలిచినట్లు తెలిపారు. ప్రస్తుతం గోరుకల్లు జలాశయంలో 4 టీఎంసీల నీటి నిల్వ ఉండగా రివెట్మెంట్ పనుల కోసం ఒక టీఎంసీలోపు నీటిని తగ్గించాల్సి ఉందన్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు నీటిని అవుకు జలాశయానికి విడుదల చేస్తున్నట్లు చెప్పారు. నీటి నిల్వ తగ్గిన వెంటనే పనులు చేపడతామన్నారు. ఈ పనులు పూర్తి కాగానే నీటి నిల్వ చేపట్టనున్నట్లు చెప్పారు.

ఆదిత్యునికి క్షీరాభిషేకం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. జ్యేష్ఠ మాసం మిధున సంక్రమణం సందర్భంగా సూర్యనారాయణ స్వామికి క్షీరాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, అర్చనలు విశేషంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

చదరంగంతో మెదడుకు పదును

కర్నూలు (టౌన్): మెదడుకు పదును పెట్టే క్రీడ చెస్ క్రీడ అని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీలను ఆయన ప్రారంభించారు. విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంచే చెస్ క్రీడలో సాధన చేస్తే చదువులో మరింతగా రాణిస్తారన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2006-2007వ సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 18 ఏళ్ల తర్వాత ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాసులు, శివ, చాంద్‌బాషా, ఆంజనేయులు, పురుషోత్తం, పుల్లన్న, రఫి, మహేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని తహసీల్దార్ వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

15 లీటర్ల నాటుసారా స్వాధీనం

కర్నూలు (టౌన్): అక్రమంగా నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి ఆదివారం కాల్వ గ్రామ శివారులో తనిఖీలు నిర్వహించారు. గుడుంబాయి తండాకు చెందిన టీ.నాగేంద్రనాయక్ అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై 15 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. నిందిదుడిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కే.చంద్రహాస్ వెల్లడించారు. దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌బాబు పాల్గొన్నారు.

జోరుగా ఉల్లినాట్లు



వర్కూరులో బోరుబావి కింద ఉల్లినాట్లు వేస్తున్న కూలీలు

కోడుమూరు రూరల్: మండలంలో ఉల్లి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో మంచి వర్షాలు కురుస్తుండడంతో వర్కూరు, పులకుర్తి, ప్యాలకుర్తి, గోరంట్ల, లద్దగిరి గ్రామాల్లో బోరుబావుల కింద రైతులు జోరుగా ఉల్లి నాట్లు వేస్తున్నారు. గత ఏడాది ప్రారంభంలో ఉల్లికి గిట్టుబాటు ధర లభించినప్పటికీ ఆ తర్వాత గిట్టుబాటు ధర లేకుండా పోయింది. ఈ ఏడాదైనా ఉల్లి సాగుతో లాభాలు వస్తాయన్న ఆశతో చాలా మంది రైతులు ఉల్లి సాగు చేస్తున్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులు



సందేశమిస్తున్న జయ గోవిందదాస్ ప్రభు

కర్నూలు కల్చరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే నైతిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉందని ఇస్కాన్ ప్రచారకులు జయ గోవిందదాస్ అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో భగవద్గీత శిక్షణా తరగతులు, ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆధ్యాత్మిక అంశాల గురించి అవగాహన కల్పించాలన్నారు. పురాణ ఇతిహాసాలు, రామాయణం, మహాభారతాల గురించి వివరించాలన్నారు. హరే రామ హరే కృష్ణ జప యజ్ఞం చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కర్నూలు కల్చరల్: సోమిశెట్టి నగర్‌లోని రేషన్ షాప్ నుంచి ఆదివారం రాత్రి ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీస్‌లు, రెవెన్యూ సిబ్బంది దాడులు చేశారు. 160 కేజీల బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

వైద్య విద్యార్థుల మృతికి నివాళి

కర్నూలు(హాస్పిటల్): గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మరణించిన వైద్య విద్యార్థులకు కర్నూలు మెడికల్ కాలేజీలో ఘనంగా నివాళులర్పించారు. ఏపీ జూనియర్ డాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీ నుంచి కర్నూలు మెడికల్ కాలేజీ వరకు క్యాండిళ్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సీబీ.సాహస్ మాట్లాడుతూ.. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న విమాన ప్రమాదం అందరినీ తీవ్రంగా కలచివేసిందన్నారు. ఆ విమానం అక్కడి హాస్పిటల్ వసతి గృహంపై కూలి వైద్య విద్యార్థులు మరణించడం బాధాకరమన్నారు. వారి ఆత్మకు శాంతిచేకూరాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షుడు హరి, హరుణ్ రషీద్, కుమార్ రాజా, అడ్వయిజరీ కమిటీ సభ్యులు అనంత్‌నాగ్, యూజీ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి నాగన్న

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలోని దళితుల శ్మశాన వాటికలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, కంపచెట్లను తొలగించి గుంతలు దిగని చోట మట్టిని తోలించాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ.. మండలంలో దళితుల శ్మశాన వాటికలో అనేక సమస్యలు నెలకొన్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించడంలో పంచాయతీ అధికారులు చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో మండలంలోని పాలకొలను, మీదివేముల, బైరాపురం తదితర గ్రామాలలో శ్మశాన వాటికలో రాతినేలలు కావడంతో శవాలను ఖననం చేయడానికి వీలులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాలలో శ్మశాన వాటికలలో పిచ్చి మొక్కలు, కంపచెట్లు ఉన్నాయని, వీటి వల్ల శవాలను తీసుకెళ్లేందుకు నానా తంటాలు పడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీల అధికారులు స్పందించి శ్మశాన వాటికల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించి, ముళ్ల పొదలను తొలగించాలని, బండరాయి ఉన్న శ్మశానాలలో మట్టిని తోలి గుంతలు దిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శాఖా కార్యదర్శి మద్దిలేటి, సభ్యులు కృష్ణుడు, మద్దిలేటి, అన్నయ్యలు, చిన్న మాధన్న తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ముప్పు



కొత్తూరు -నందివర్గం మార్గంలో రోడ్డుపై పడ్డ చెట్టు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు-నందివర్గం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఉన్న రోడ్డుపై ఓ చెట్టు విరిగిపోయి అడ్డంగా పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలతో రోడ్డు రద్దీగా ఉంది. చెట్టు విరిగి పడిన చోట రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎదురెదురుగా వచ్చిన వాహనదారులు ఒకరి తరువాత ఒకరు క్రాస్ అయ్యి వెళుతున్నారు. ఈ చెట్టుతో పాటు మరో చెట్టు కూడా రోడ్డుపై చెట్టు విరిగిపడింది. దీంతో రాత్రి సమయల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అధికారులు చర్యలు తీసుకొని రోడ్డుపై విరిగిపడిన చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల ఇక్కట్లు

- నిత్యం నిలబడే ప్రయాణాలు
- ఆర్టీసీ సర్వీసుల పెంపుపై దృష్టి పెట్టని అధికారులు



కోడుమూరులో కర్నూలు బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

కోడుమూరు రూరల్: నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లేందుకు బస్సు సర్వీసులు తక్కువగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోడుమూరు నుంచి కర్నూలుకు నిత్యం ఉద్యోగ, విద్య, వైద్యం వ్యాపారాల నిమిత్తం రోజుకు వందలాది మంది ప్రయాణాలు సాగిస్తుంటారు. వీరికి తోడు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతి రోజు వివిధ అవసరాల నిమిత్తం అనేక మంది ప్రజలు ప్రయాణాలు చేస్తుంటారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సర్వీసులు తక్కువగా ఉండడంతో ప్రయాణికులు నిత్యం నిలబడే ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులు, ఉద్యోగుల పరిస్థితి మరింత ఘోరంగా ఉంటోంది. నిలబడటానికి కూడా చోటు లేని బస్సుల్లో ప్రయాణించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సింగిల్ స్టాఫ్ సర్వీసులతో ఇక్కట్లు

కోడుమూరు మీదుగా ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, కర్నూలు డిపోలకు చెందిన బస్సు సర్వీసులు కర్నూలుకు నడుపుతున్నప్పటికీ అవి ప్రయాణికుల రద్దీకి ఏమాత్రం సరిపోవడం లేదు. ఉన్న సమస్యలు చాలాదన్నట్లు కొన్నేళ్లుగా కర్నూలు నుంచి ఆదోనికి సింగిల్ సర్వీసు బస్సులను ఆర్టీసీ అధికారులు నడుపుతుండడంతో సమస్య మరింత జఠిలమైంది. బస్సు సర్వీసులు లేక చాలా మంది ప్రయాణికులు ఆటోలు ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.



బస్సుల్లేక ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

బస్సు సర్వీసులను పెంచాలి



కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లిరావాలంటే ఇబ్బందిగా ఉంటోంది. ఉదయం కర్నూలుకు వెళ్లి సాయంత్రం కోడుమూరుకొచ్చే సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో నిత్యం నిలబడే రావాల్సి వస్తోంది. కొన్ని సమయాల్లో నిలబడటానికి కూడా చోటు లేక బస్సులు దొరకక నరకయాతన అనుభవిస్తున్నాం. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సర్వీసులను పెంచి ఇబ్బందులు తీర్చాలి.

–శ్రీనివాసులు, కోడుమూరు

కొత్తూరుకు పోటెత్తిన భక్తులు



అభిషేకాలు చేస్తున్న భక్తులు



అన్న సత్రంలో ప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకే క్యూలైన్లు నిండిపోయాయి. మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తుల తాకిడి ఉండడంతో అధికారులు అన్ని రకాల ఏర్పాటు చేశారు. అలాగే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ఇతర విశిష్ట కైంకర్యాలు నిర్వహించారు. స్వామి దర్శనం అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.